క్లుప్తంగా

సమయపాలన పాటించని సిబ్బంది



సిబ్బంది కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

కొండపి: మండలంలోని నేతివారిపాలెం గ్రామం సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉదయం 10:45 కూడా సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని తమకు నచ్చినప్పుడు విధులకు వస్తున్నారని ఆరోపిస్తున్నారు. శనివారం ఉదయం సాక్షి ప్రతినిధి సచివాలయానికి వెళ్లగా కేవలం వీఆర్వో మాత్రమే సచివాలయంలో అందుబాటులో ఉన్నారు. మహిళా కానిస్టేబుల్ విధుల నిమిత్తం గ్రామంలోకి వెళ్లిందని తెలిపారు. మిగతా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పోవడంతో ప్రజలు ఎదురు చూస్తూ కూర్చున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల పరిరక్షణ కోసం నిరసన

సీఎస్‌పురం (పామూరు): పాఠశాలల పరిరక్షణ కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కనిగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 5వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్.ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతులు ఉండే విధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ మాత్రమే ఉండాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలన్నారు. 1 నుంచి 5 తరగతులు హైస్కూల్‌కు అనుసంధానం చేసే విధానం విరమించుకోవాలనే తదితర డిమాండ్ల సాధన కోసం నిరసన చేస్తున్నామన్నారు. ప్రభుత్వం మారినా అధికారులు తమ ఇష్టారీతిన వ్యవహరిస్తూ విద్యావ్యవస్థను గందరగోళం చేస్తున్నారన్నారు. నిరసన కార్యక్రమానికి మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

భూసార పరీక్షలతో లాభాలు



మట్టి నమూనా సేకరణపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

సింగరాయకొండ: రైతులు తమ పొలాలకు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని వ్యవసాయాధికారి వీ సుధాకర్ అన్నారు. మండలంలోని సోమరాజుపల్లిలో శనివారం రైతులకు మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుధాకర్ మాట్లాడుతూ మట్టి పరీక్షల వలన భూమిలో ఉండే పోషక విలువల వివరాలు తెలుస్తాయన్నారు. ఆ ప్రకారం ఎరువులు, పురుగు మందులు వాడి అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం ఏవో శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావేదికలో 250 అర్జీల దాఖలు



ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి స్వామి

మర్రిపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక ప్రజా పరిష్కార వేదిక జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి డోలాబాల వీరాంజనేయస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి దాదాపు 250 వినతులు సమర్పించారు. అందులో 200 రెవెన్యూ శాఖ సమస్యలు ఉండగా, వాటిలో 100 కుపైగా పోర్టింగ్ సమస్యలు ఉన్నాయని మంత్రి స్వామి తెలిపారు. ఇప్పటివరకు 15 రకాల సమస్యలను పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్వాల నరసింహారావు, ఎంపీడీవో జగదీష్, ఏఓ వెంకటేష్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ఆనికాలపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చి 14 వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్థానిక చర్చి ప్రాంగణంలో సేవకుల సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు మండలంలోని అన్ని చర్చిల పాస్టర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా సంఘ సేవకులకు పాస్టర్‌లు గూడూరి బంగారయ్య, ఆరోన్‌లు దుస్తులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తోటివారిపట్ల ప్రేమ, దయ, శాంతి, కరుణ చూపేలా దైవసేవకులు సమాజంలోని యువతను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రైతుల పాలిట పగాకు



గ్రేడ్ చేసిన లో గ్రేడ్ పొగాకు



కూటాగుండ్లలో రైతు ఇళ్లలోనే పొగాకు గ్రేడ్ చేస్తున్న కూలీలు

- గిట్టుబాటు ధర లేక ఇళ్లలోనే పొగాకు
- లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం లేదంటున్న రైతులు
- మండలంలో 300లకు పైనే బ్యారన్‌లు
- నిండాముంచిన కూటమి ప్రభుత్వం

హనుమంతునిపాడు:

ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోతే ఎంత నరకంగా ఉంటుందో రైతులకు తెలుసు. కనీసం పెట్టుబడి కూడా రాకపోతే తెచ్చిన అప్పులకు వడ్డీ ఎలా కట్టాలో తెలియక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతులు నిండా మునిగారు. ప్రతి పంటకు సరైన గిట్టుబాటు అందక రైతన్నలు అప్పుల పాలయ్యారు. ముఖ్యంగా పొగాకు రైతులను ప్రభుత్వం పూర్తిగా మోసం చేసింది. ఈ ఏడాది పొగాకు రైతులకు పూర్తిస్థాయిలో నష్టాలు తప్ప లేదు. మండలంలో పొగాకు బ్యారన్లు సుమారు 300 ఉన్నాయి. పొగాకు బోర్డు లెక్కల ప్రకారం ఒక్కో బ్యారన్ కింద 10 ఎకరాలు సాగు చేయాలి. కాని రైతులు తుఫాన్‌కు, వర్షాభావంతో 15 ఎకరాల పైబడి సాగు చేశారు. గత ఏడాది ఒకొక్క బ్యారన్ కింద రైతుకు రూ.7 లక్షలు ఖర్చు అయినట్లు చెప్తున్నారు. ఈ ఏడాది బ్యారన్‌కు రూ.10 లక్షల వరకు ఖర్చు అయింది. గతం కంటే ఈ ఏడాది ఖర్చులు, కూలీలు, పెట్టుబడులు రెట్టింపయ్యాయి. అప్పులు చేసి చెమటోడ్చి పండించిన పొగాకుకు గిట్టుబాటు ధర లేక రైతన్నలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది.

గత ప్రభుత్వంలో రైతన్నగా రాజు..

గత ఏడాది క్వింటా పొగాకు రూ.36 వేల వరకు ధర పలికింది. గత ఏడాది లోగ్రేడు, మిగతా పొగాకును పూర్తి స్థాయిలో రైతుకు గిట్టు బాటు ధర వచ్చే విధంగా ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈఏడాది పండించిన పొగాకు ధర లేక ఇళ్లలోనే చెక్‌లు నిల్వ ఉన్నాయి. ఒక్కో బ్యారన్‌కు రూ.10 లక్షల వరకు ఖర్చు అయినట్లు రైతులు చెప్తున్నారు. ధర చూస్తే మాత్రం పూర్తిగా పడిపోయింది. గిట్టు బాటు ధర రావడం లేదు. బోర్డుకు తీసుకెళ్లిన పొగాకు చెక్‌లకు గిట్టుబాటు ధర పడడం లేదు. అడిగిన ధరకు ఇవ్వ లేక చెక్కులు తిరిగి ఇళ్లకు తీసుకొస్తున్నారు. వేలంలో మాత్రం ఎక్కడో ఒక చెక్‌కు రూ కిలో రూ.280 వరకు ధర వేస్తున్నారు. మిగతా చెక్‌లకు ఏదో వంక పెట్టి కంపెనీదారులు కిలో రూ 230, రూ.240లకు ధరకు మించి కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పొగాకుకు సరైన గిట్టుబాటు ధర అందించకపోతే నిలువునా నష్టపోతామని, వెంటనే గిట్టుబాటు ధర అందించాలని డిమాండ్ చేస్తున్నారు.



రేకులపై పెట్టిన పొగాకు

ధర లేక బేళ్లను ఇంటికి తెస్తున్నాం.



లో గ్రేడు పొగాకు ఒక్క చెక్కు కూడా కొనుగోలు చేయడం లేదు. నేను రెండు బ్యారన్ల కింద 25 ఎకరాల వరకు పొగాకు సాగు చేశాను. ఈ ఏడాది కూలీలు, ఖర్చులు అన్నీ రెట్టింపయ్యాయి. ఇప్పటి వరకు రూ.25 లక్షలు ఖర్చు పెట్టాను. పండించిన చెక్‌లు అన్ని ఇంట్లోనే ఉన్నాయి. ఈ ఏడాది గిట్టు బాటు ధరలేదు. అప్పులు, వడ్డీలు పెరిగిపోతున్నాయి.

– గాలం రామక్రిష్ణ, పాతమల్లవరం, సర్పంచ్

పొగాకు సాగుతో పూర్తిగా నష్టపోయా



ఈ ఏడాది పండించిన పొగాకు గిట్టుబాటు ధర పడక పూర్తిగా నష్టాలు వచ్చాయి. గత ఏడాది ఈపాటికి పండించిన పొగాకు బోర్డు వారు సగం చెక్‌లు కొనుగోలు చేశారు. ఈ ఏడాది కిలో రూ 230, రూ.240 మించి ధర పలకడం లేదు. మాడు, లోగ్రేడు పొగాకు కొనుగోలు చేయడం లేదు. చెక్‌లు ఇంట్లోనే ఉన్నాయి. ప్రభుత్వం గిట్టు బాటు ధర కల్పించాలి.

– గాలం తిరుపతయ్య, పాతమల్లవరం

పిచ్చికుక్కల పట్టివేత షురూ !

సాక్షి ఎఫెక్ట్..

కనిగిరిరూరల్: ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు నిద్రలేచారు. గత నెలలో ఒకే రోజు పిచ్చికుక్క 32 మందికి కాట్లు వేసి ఆస్పత్రి పాలు చేసింది.. తాజాగా శుక్రవారం ఒక్క రోజే పిచ్చి కుక్క సుమారు 25 మందిని కరవడంతో తీవ్రగాయాల పాలయ్యారు. దీంతో పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా ప్రజలు ఘాటు విమర్శలు చేశారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు కుక్కల బెడదతో తీవ్ర గాయాల పాలవుతుంటే.. మున్సిపల్ అధికారులు ఏమయ్యారని ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దీంతో కదిలిన అధికారులు కుక్కలు పట్టేవారిని శనివారం పిలిపించారు. పట్టణంలోని ఎన్జీవో కాలనీ, ఇందిరా కాలనీ, గార్లపేట రోడ్డు, బొడ్డు చావిడి వీధి, సుభాష్ రోడ్డు, ఎంఎస్ఆర్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని వీధి, పిచ్చి కుక్కలను పట్టుకున్నారు. 5 రోజుల పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో తిరిగి వీధి, పిచ్చి కుక్కలను పట్టుకునే కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. పట్టణ ప్రజలు పెంపుడు కుక్కలను బయటకు రానివ్వకుండా తమ ఇంట్లోనే ఉంచి సంరక్షించుకోవాలని తెలిపారు.



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

పొగాకు సరాసరి ధర కేజీ రూ.266



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు



వేలం నిర్వహిస్తున్న నిర్వహణధికారి సునీల్ కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు సరాసరి ధర కేజీ రూ 266.92 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి సునీల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ పరిధిలోని గోగినేనివారిపాలెం, అక్కచెరువుపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 994 బేళ్లను తీసుకొని వచ్చారు. అందులో 893 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 101 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.210 నమోదైంది. వేలంలో 20 కంపెనీలు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు. వేలంలో అతి తక్కువ నో బిడ్లు, ఎక్కువ సరాసరి ధర పలికిందని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు.

పొగాకు సరాసరి ధర కేజీ రూ 259.94

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు సరాసరి ధర కేజీ రూ 259.94 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కే.ఉప్పలపాడు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 744 బేళ్లను తీసుకురాగా 629 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 115 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.215గా నమోదైంది. వేలంలో 14 కంపెనీలు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రధాన వాగుల స్థితిపై రెవెన్యూ సర్వే



సర్వే చేస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

కనిగిరిరూరల్: పట్టణంలోని నీరు పారే ప్రధాన వాగుల సర్వే నంబర్లను శనివారం రెవిన్యూ అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ ఏవీ రవిశంకర్‌తో పాటు, వీఆర్వోలు, సర్వేయర్లు రెండు బృందాలుగా ఏర్పడి ప్రధాన వాగుల సర్వే నంబర్లు, భూముల హద్దులు, ఎంతమేర ఆక్రమణలు జరిగాయనే తదితర అంశాలను పరిశీలించారు. తొలి రోజు కంభం రోడ్డు నుంచి కొత్తూరు వరకు సర్వే చేశారు. కొన్ని చోట్ల ప్రధాన వాగులను రియల్టర్లు ఆక్రమించినట్లు గుర్తించారు. పట్టణంలోని నాలుగు దిక్కుల్లో ఉన్న ప్రధాన పెద్ద వాగులు, కొండవాగులు అన్ని గుర్తించి ఎంతమేర ఆక్రమణలు చేశారు.. ఎవరు ఆక్రమించారనే దానిపై ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వనున్నట్లు సమాచారం.

కమనీయం కోదండరాముడి కల్యాణం !



నూతనంగా ప్రతిష్ఠించిన సీతారాముల, లక్ష్మణ విగ్రహాలు



కోదండరామస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు

పొన్నలూరు: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి దేవాలయంలో శనివారం సీతా సమేతా కోదండరామస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా సీతారాముల యంత్ర ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విఘ్నేశ్వరుని ప్రతిష్ఠ చేపట్టి దేవతామూర్తులకు పూజలు నిర్వహించి ఆలయంలో సీతారాముల లక్ష్మణ, అభయాంజనేయస్వామి విగ్రహాలను వేదమంత్రోచ్చారణ మధ్య ప్రతిష్ఠించారు. అనంతరం సీతారాముల శాంతి కల్యాణాన్ని వేద పండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బంధువులు నూతన వస్త్రాలు ధరించి సందడి వాతావరణంలో కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రామనామ స్మరణతో మారుమోగింది. అర్చకులు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారిని మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి గ్రామోత్సవ కార్యక్రమం చేపట్టారు.

పీసీపల్లి: మండల పరిధిలోని బట్టుపల్లి గ్రామంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి రాత్రి సీతారాముడి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఆవులవారిపల్లిలో..

హనుమంతునిపాడు: మండల పరిధిలోని ఆవులవారిపల్లి గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మేళ తాళాల నడుమ కొండా తిరుపతరెడ్డి, పద్మావతి, తాతిరెడ్డి రామిరెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి, క్రిష్టారెడ్డి, ఎస్ హనుమంతు, అంజయ్య, కాశయ్య తదితరులు ఉన్నారు.



కల్యాణం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో కోదండరామస్వామి



ఆవులవారిపల్లిలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

వెలిగొండతోనే పశ్చిమ ప్రాంతానికి పరిష్కారం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

కనిగిరిరూరల్: ఎన్నికల హామీల అమలులో కూటమి సర్కార్ ఘోరంగా విఫలం చెందిందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం.. శనివారం విలేకర్లతో మాట్లాడారు.పోలవరం ప్రాజెక్టు, రాజధాని పునఃనిర్మాణం పేరితో కాలయాపన చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గత నాలుగు నెలల నుంచి రేషన్ పంపిణీలో బియ్యం ఒక్కటే ఇస్తున్నారని.. పేదలకు కంది పప్పు అందని ద్రాక్షలా మారిందని ఘాటుగా విమర్శించారు. వెనుకబడిన ప్రకాశం జిల్లాలో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి కృష్ణా జలాలు అందించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతోనే పశ్చిమ ప్రాంత ప్రజలకు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. జూన్ 21, 22, 23 తేదీల్లో సీపీఐ 17వ జిల్లా మహాసభలు దర్శిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభలకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్, వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పందిటి మోహన్, జీపీ రామారావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పామూరు: రాష్ట్రంలో ఎన్నికల వేళ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతల ప్రభాకర్ పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం శనివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ సూపర్ సిక్స్ పథకాలతో గద్దెనెక్కి హామీలపై దాటవేత వైఖరి అమలుచేస్తున్నదన్నారు. పామూరు మండలంలో ట్రిపుల్‌ఐటీ కళాశాలకు నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో భూమిపూజ చేశారని, నేడు ఆ ప్రభుత్వం వచ్చినా ఊసేలేదన్నారు. తక్షణం కళాశాల నిర్మాణం ప్రారంభించాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్‌మౌలాలి, వజ్రాల సుబ్బారావు, పాలపర్తి మస్తాన్‌రావు, ఇర్రి వెంకటరెడ్డి, మహేష్, ఖాజావలి, మల్లికార్జున పలువురు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కదిరి బాబురావును సన్మానించిన దద్దాల



కదిరి బాబురావును సన్మానిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ పరిశీలకుడిగా నియమితులైన కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావును, పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ హైదరాబాద్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. కదిరి బాబురావుకు దద్దాల, పార్టీ కనిగిరి నేతలు పుష్ప గుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, వాకుమళ్ల రాజశేఖర రెడ్డి, శ్రీరాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సేద్యం మానవాళికి ఆరోగ్యం



కొణిజేడులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

టంగుటూరు: గో ఆధారిత, సేంద్రియ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతో మానవాళికి ఆరోగ్య రక్షణ లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకట్రావు పేర్కొన్నారు. కేఏపీ ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌లో భాగంగా మండలంలోని కొనిజేడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి సిబ్బందితో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పండించే పంటలతో తయారుచేసే ఆహార ఉత్పత్తులు విషపూరితమై మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రైతు శ్రీనును శాలువతో సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వీఏఏ సౌమ్య, యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

అనకర్లపూడిలో..

కొండపి: గో ఆధారిత, సేంద్రీయ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని ప్రకతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి రంజిత్ అన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌లో భాగంగా మండలంలోని అనకర్లపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గురించి లాభాల గురించి ప్రకతి వ్యవసాయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీఆర్పీలు తిరుమల, గౌతమీ రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అనకర్లపూడిలో మాట్లాడుతున్న యూనిట్ ఇన్‌చార్జి రంజిత్